విసిలతో నేడు సిఎం సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశ్వవిద్యాలయాల నూతన ఉపకులపతుల (విసి)తో శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో సమావేశం కానున్నారు. ఈనెల 18న నూతన విసిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. సామాజిక తరగతులు, వారి ప్రతిభ ఆధారంగా విసిలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. 107 ఏండ్ల ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) చరిత్రలో దళిత ప్రొఫెసర్ ఎం కుమార్‌కు విసి పదవిని ప్రభుత్వం కట్టబెట్టింది. కేయూ విసిగా ప్రతాప్‌రెడ్డి, పీయూ విసిగా జీఎన్ శ్రీనివాస్, ఎస్‌యూ విసిగా ఉమేష్‌కుమార్, పిఎస్‌టియు విసిగా నిత్యానందరావు, ఎంజీయూ విసిగా అల్తాఫ్‌హుస్సేన్,టీయూ విసిగా యాదగిరిరావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విసిగా అల్దాస్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా రాజిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అంతకుముందు మహిళా విశ్వవిద్యాలయం విసిగా ధనావత్ సూర్య, ఆర్జీయూకేటీ బాసర త్రిపుల్ ఐటీ విసిగా ఎ గోవర్ధన్‌ను ప్రభుత్వం నియమించింది. దీంతో రాష్ట్రంలో 11 విశ్వవిద్యాలయాలకు విసిలను నియామకం పూర్తయ్యింది. ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్‌గా ఇటిక్యాల పురుషోత్తంను ప్రభుత్వం నియమించింది. తొలిసారిగా వారితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సమావేశం కానున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, విశ్వవిద్యాలయాలు సాధించాల్సిన ప్రగతి, విద్యార్థులకు అందించాల్సిన మౌలిక వసతులు, అధ్యాపక పోస్టుల ఖాళీలు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై చర్చించే అవకాశమున్నది. నూతన విసిల నుంచి ప్రభుత్వం ఎలాంటి ప్రగతిని ఆశిస్తున్నదో సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నట్టు తెలిసింది. వర్సిటీల్లో ఉన్న ఇబ్బందుల గురించి విసిల నుంచి అడిగి తెలుసుకునే అవకాశమున్నది.

ప్రాథమిక ఉపాధ్యాయులతోనే కులగణన

- 6 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం
- మూడు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశం
- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల టీచర్లకు మినహాయింపు
- ఉత్తర్వులు విడుదల



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల ఆరో తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే కులగణన సర్వేకు ప్రాథమిక ఉపాధ్యాయులనే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మినహాయింపునిచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఈ నెల ఆరో తేదీ నుంచి మూడు వారాల వ్యవధిలో (ఈ నెల 30 వరకు) కులగణన సర్వేను పూర్తి చేయడానికి ఉపాధ్యాయులతో సహా 80 వేల మంది ఎంఆర్‌ఒ ఉద్యోగులు, ఎండిఒ, ఎంపిఒలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నందున సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో బోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ముసాయిదాను రూపొందించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 36,559 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జిటి), 3,414 మంది ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు (పిఎస్‌హెచ్‌ఎం), 6,256 మంది ఎంఆర్‌సి సిబ్బంది, రెండు వేల మంది ప్రభుత్వ, ఎంపిపి/జడ్‌పిపి, ఎయిడెడ్ పాఠశాలల్లోని మినిస్టీరియల్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సర్వేకోసం అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ల సేవలను కూడా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

మధ్యాహ్నం ఒంటి గంట వరకు బడి, ఆ తర్వాత కులగణన సర్వే

కులగణన సర్వేను నిర్వహించేందుకు ప్రాథమిక పాఠశాలల ఎస్‌జిటిలు, పీఎస్‌హెచ్‌ఎంల సేవలను వినియోగించడానికి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను ఉదయం తొమ్మిది నుంచే నడపాలని నిర్ణయించామని వెంకటేశం తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు బోధన ఉంటుందని, ఆ తర్వాత మధ్యాహ్న భోజనం అందించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం నుంచి ఎస్‌జిటిలు, పిఎస్‌హెచ్‌ఎంలు ప్రణాళికా విభాగం సమన్వయంతో కులగణన సర్వే విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జిటిల సేవలను కులగణన విధుల నుంచి మినహాయించబడ్డాయని వివరించారు. ఈ పాఠశాలలు షెడ్యూల్ ప్రకారమే పనిచేస్తాయని తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది అన్ని సెలవుల్లో ప్రణాళికా విభాగం సూచనల మేరకు సర్వేకు హాజరు కావాలని కోరారు. ప్రణాళికా విభాగం నిబంధనల ప్రకారం వేతనాన్ని చెల్లించాలని పేర్కొన్నారు.

విద్యాశాఖలో 50 వేల మందికి విధులు : నరసింహారెడ్డి

విద్యాశాఖలో 50 వేల మందికి కులగణన సర్వే విధులు కేటాయించామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తెలిపారు. ఇందులో 36,559 మంది ఎస్‌జిటిలు, 3,414 మంది పీఎస్‌హెచ్‌ఎంలు, 6,256 మంది ఎంఆర్సీలు, రెండు వేల మంది మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారని వివరించారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్‌ల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందిని వినియోగిస్తామని పేర్కొన్నారు. వారు ఇంటింటి సర్వే చేపట్టాలని కోరారు.

ఎస్‌జిటిలకే కేటాయించడానికి టిపిటిఎఫ్ ఖండన

కులగణన విధులను ఎస్‌జిటిలకే కేటాయించడాన్ని టిపిటిఎఫ్ ఖండించింది. అన్ని రకాల పాఠశాలల్లో అధికంగా ఉపాధ్యాయులను గుర్తించి విధులను కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి తెలిపారు. పాఠశాలల పనివేళలకు ఆటంకం కలగించొద్దని కోరారు.

ఉపాధ్యాయులందరికీ విధులు కేటాయించాలి : టిఎస్‌టియు

కులగణన విధులను ఉపాధ్యాయులందరికీ కేటాయించాలని టిఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి తెలిపారు. ఈ ఉత్తర్వులను సవరించాలని కోరారు.

ప్రజావాణికి 384 దరఖాస్తులు

హైదరాబాద్ బ్యూరో : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో 384 దరఖాస్తులు అందాయి. మైనారిటీవెల్ఫేర్ శాఖకు సంబంధించి 255, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60, విద్యుత్ శాఖకు సంబంధించి 24, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 15, ఇతర శాఖలకు సంబంధించి 31, దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్‌చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేకాధికారి దివ్య పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
H.M.O.P.215/2023

Between:-
Marpu @ Duppatla Rajyalakshmi, ...Petitioner
And:-
Duppatla Chinnababu. .....Respondent

To,

Defendant:-
Duppatla Chinnababu, S/o Tatayya, Hindu, Ageda bout 45 years, R/o. Uppal, Medchal, Malkajgiri District, Hyderabad, Telangana State.

NOTICE

Please Take notice that the above matter stands posted on 07-11-2024 for your appearance before the court, therefore you are hereby directed to appear before the Honorable court on **07-11-2024 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

// By Court Order //

P.V. RAMANA DAYAL
ADVOCATE,
SRIKAKULAM.

సిఎంకు మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉన్నతాధికారులు

సిఎంకు ఉన్నతాధికారుల ధన్యవాదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ముఖ్యమంత్రికి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వివిధ సంక్షేమ విభాగాల సెక్రటరీలు కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి కానుకగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వసతిగృహాలు, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని వసతిగృహాల్లో డైట్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. డైట్ చార్జీల పెంపు విషయంలో కమిటీ ప్రతిపాదనను యథావిధిగా అమలు చేయడంపై ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా డైట్‌లో మార్పులు, చేర్పులు చేయాలని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. పది రోజుల్లో కొత్త డైట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని వారిని ఆదేశించారు. పెంచిన డైట్, కాస్మోటిక్ ఛార్జీలతో 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది.

బిసిల లెక్క తేల్చేందుకే సర్వే..

- బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్
- కరీంనగర్‌లో అభిప్రాయాలు, విజ్ఞప్తుల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర జనాభాలో బిసిల లెక్క తేల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి, సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తుందని బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేసే విషయమై వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో సభ నిర్వహించారు. బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మితో కలిసి నాలుగు జిల్లాల నుంచి తరలివచ్చిన బిసి సంఘాల నాయకులు, ఆ సామాజిక తరగతి వారి అభిప్రాయాలు, విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడారు. తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. రాజకీయంగా వెనుకబడ్డామని, తమ పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమను వేరే సామాజిక తరగతిలో చేర్చాలని కొందరు విన్నవించారు. బిసి మహిళా రిజర్వేషన్లు కూడా కల్పించాలని కోరారు.

విజ్ఞప్తులు స్వీకరణ..

ఈ సందర్భంగా నాలుగు జిల్లాల వారీగా వచ్చిన అర్జీలను కమిషన్ సభ్యులు స్వీకరించారు. తమకు వచ్చిన అర్జీలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. కరీంనగర్- 99, జగిత్యాల-29, పెద్దపల్లి-32, సిరిసిల్ల-53 మొత్తం 213 విజ్ఞప్తులు వచ్చాయని తెలిపారు. అర్జీలు అందించేందుకు వచ్చిన వారి కోసం హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, పెద్దపల్లి కలెక్టర్ కోయ హర్ష, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

డైట్‌చార్జీలు పెంచాం.. పేద బిడ్డలను అక్కున చేర్చుకున్నాం

- విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా ప్రభుత్వంలో డైట్‌చార్జీలను పెంచి పేదబిడ్డలను అక్కున చేర్చుకున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. దీని ద్వారా మొత్తం 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పేద విద్యార్థుల అరిగోస తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని హాస్టళ్లలో ఉండే పిల్లలకు 40 శాతం డైట్‌చార్జీలను పెంచారని పేర్కొన్నారు. విద్యార్థులకు, విద్యార్థునులకు కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచడం హర్షనీయమని తెలిపారు. డైట్ చార్జీల పెంపును ఒక బిసి బిడ్డగా, మంత్రిగా తనకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లకాలంలో ఒక్కసారి కూడా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలు, నిరుపేద విద్యార్థుల కోసం అనునిత్యం పని చేస్తుందని స్పష్టం చేశారు. అందుకే, దీపావళి సందర్భంగా అట్టడుగు బిడ్డలను కాంగ్రెస్ సర్కారు ఆదుకున్నదని వివరించారు

ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌కు లైంగిక వేధింపులు!

- మంత్రి ఉత్తమ్ పిఎనంటూ వాయిస్ మెసేజ్‌లు
- సూపర్‌వైజర్లందరికీ కాల్స్ చేస్తున్నట్టు సమాచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిడిపిఒ కార్యాలయం సూపర్‌వైజర్‌కు లైంగిక వేధింపులు వస్తున్నాయి.. ప్రభుత్వాధికారులే టార్గెట్‌గా చేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేస్తూ మహిళలను వేధిస్తున్నాడు. ఓ బాధిత సూపర్‌వైజర్ తెలిపిన వివరాల ప్రకారం..తనకు ఓ వ్యక్తి ఇటీవల కాల్ చేసి "నేను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పిఎని.. మీ కార్యాలయానికి సంబంధించిన వివరాలు, సిబ్బంది వివరాలు కావాలని అడిగారు. అనుమానం వచ్చి అసలు మీరెవరు అని అడగ్గా.. మీ డీపీ ఫొటో ఎంతో అందంగా ఉంది. నాకు నచ్చారు.. ఎంత డబ్బైనా ఇస్తా లొంగిపోవాలి" అంటూ వేధిస్తూ మెసేజ్‌లు పెట్టాడు. ఆ మెసేజ్‌లు చూసి.. సంబంధిత నెంబర్‌కు కాల్ చేయగా 'నీవు అందంగా ఉన్నావ్.. నాకు నచ్చావ్ అందుకే ఇటువంటి మెసేజ్‌లు పెడుతున్న.. ఇటీవలే నేను జైలుకు వెళ్లి వచ్చా. నువ్వు ఏమీ చేయలేవు' అని అంటూ బెదిరింపులకు గురిచేస్తున్నాడు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి కోదాడ సిడిపిఒ కార్యాలయానికి మాత్రమే కాకుండా మెదక్, హుజూర్‌నగర్ ఐసిడిఎస్ పరిధిలోని మరికొంతమంది సూపర్‌వైజర్లకు కూడా ఫోన్లు చేసి లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్టు సమాచారం. ఈ విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి "నేను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్సనల్ పీఏనంటూ పరిచయం చేసుకుంటున్నాడు. వారి వివరాలు అడిగి తెలుసుకుంటాడు. మీ సమస్యలు చెప్పాలని" అలా మాటలు కలుపుకొని ఇబ్బంది పెడుతున్నాడని పలువురు వేదన చెందుతున్నారు. అతనికి సూపర్‌వైజర్ల నెంబర్లు, బయోడేటాలు ఎలా తెలుస్తున్నాయి? ఎవరు ఇస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది. అసలు సిడిపిఒ కార్యాలయంలో ఏం జరుగుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులకే ఈ విధమైన పరిస్థితి వస్తే సామాన్య మహిళల పరిస్థితి ఏంటి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోలీసు అధికారులు స్పందించి సదరు వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవ సందర్భంగా రాజ్‌భవన్‌లో వేడుకలు నిర్వహిస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

రైతుల ఆదాయం పెంచేలా 'ఉపాధి'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రైతుల ఆదాయం పెంచేలా వ్యవసాయ అనుబంధం పనులకు ప్రాధాన్యత ఇవ్వాలనీ, శాశ్వతంగా నిలిచేలా ఉపాధి హామీ పనులు చేపట్టేలా చూడాలని అధికారులను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ఆదేశించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని నొక్కిచెప్పారు. నరేగా అమలుపై శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమిషనర్ షఫిఉల్లా, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, పంచాయతీ ఇంజనీరింగ్ విభాగం ఇఎన్‌సి కనకరత్నం, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాబోయే ఐదు నెలల కాలానికి సంబంధించి రూ. 1372 కోట్ల నరేగా నిధులతో చేపట్టే పనుల ప్రణాళికకు సీతక్క ఆమోదం తెలిపారు. మహిళలకు ఉపాధి భరోసా, పంటపొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపకం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కింద చేపట్టే పనులను చేయాలన్నారు. రూ. 106 కోట్ల నిధులతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రతి నియోజకవర్గానికి సుమారు రూ. కోటి నిధులను వెచ్చించాలని నిర్ణయించారు. మొత్తం స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆదాయాన్ని పెంచే దిశలో పశువుల కొట్టాలు, కోళ్ళ షెడ్ల నిర్మాణాం, వర్మి కంపోస్ట్-వాన పాముల ఎరువుల తయారీకి తోట్ల నిర్మాణం, ఎస్‌హెచ్‌జీలో ఉన్న రైతుల బీడు భూములను అభివృద్ధి చేసి సాగులోకి తీసుకొచ్చే ప్రణాళికలకు ఆమోదం తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి రూ. రెండు కోట్లు వెచ్చించి వ్యవసాయ పొలాలకు బాటలు వేయాలని నిర్ణయించారు. దీంతో పాటు 2,700 ఎకరాలలో రూ. 16.20 కోట్ల నిధులతో చిన్న సన్నకారు రైతులకు ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలు, ఈత మొక్కల పెంపకం చేపట్టి ఆదాయాభివృద్ధిని పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తొమ్మిది కోట్ల మొక్కలను పెంచి వచ్చే సంవత్సరం వన మహోత్సవంలో నాటడానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 65/2023
in
O.S. 474/2019

చీమకుర్తి తిరుమలస్వామి ..డిక్రీ హోల్డర్
ఎదిరి
సయ్యద్ సూరజ్ ..జడ్జిమెంట్ డెటార్

To,
జెడిఆర్ చిరునామా :
సయ్యద్ సూరజ్ తండ్రి బషీర్,
వయస్సు 55 సం.లు, ముస్లిం,
డీజిల్ టెక్నిషియన్ ఇన్ దూరదర్శన్ కేంద్రం,
రామంతపూర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా,
తెలంగాణా రాష్ట్రం.

పై నెంబరు అమలు అర్జీలోని డిహెచ్‌ఆర్, నీ యొక్క జీతం జప్తీ కోరుచు పై నెంబరు అమలు అర్జీని పై కోర్టులో దాఖలు చేసినందున, సదరు అమలు అర్జీలో నీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 14-11-2024వ తేదిన పై కోర్టులో నీకుయున్నది. నీవు వాయిదా రోజు ఉదయం 10:30 గం.లకు నీవు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీపరోక్షమందు సదరు అమలు అర్జీని విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
స్థలం: గిద్దలూరు
తేదీ: 01-11-2024 ఇట్లు
శ్రీ తురగా ఈశ్వర అంజనీ కుమార్,
డిహెచ్‌ఆర్ పరం అడ్వకేట్,
గిద్దలూరు.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM CHIEF JUDGE CITY SMALL CAUSES COURT ,CITY CIVIL CORT AT: HYDERABAD
MVOP. NO 2297 OF 2019

Between.
Sapavath Niranjan. **...Petitioner**
And
Narasaiah Lakkam. and Others. **...Respondents**

To,
1. Narasaiah Lakkam,S/o. Buchaiah,Occ:Business Cum Owner of Toofan Bearing No. **TS 05 UA 3555**,R/o. H. No.16-2/2,Srinagar Colony ,Huzurnagar Town,Nalgonda Dist . **...Respondent 1**

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 12-11-2024 .at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s. P. CHANDRAMOULI,
P. PANDU RANGA SWAMY,
ADVOCATES
Bangaru Enclave,
Kharmanghat,
Hyderabad.

జనవరి 26న ఏటా గవర్నర్ ప్రతిభా పురస్కారాలు

- 4 కేటగిరీల్లో వ్యక్తులు, సంస్థలకు 8 అవార్డుల ప్రదానం
- నేటినుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న ప్రతి ఏటా గవర్నర్ ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్టు గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వికలాంగుల సంక్షేమం, క్రీడలు, ఆటలు, సాంస్కృతిక రంగంలో పనిచేసిన వ్యక్తులు, సంస్థలు, ట్రస్టులు, సొసైటీలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తామని అన్నారు. నాలుగు కేటగిరీల్లో నలుగురు వ్యక్తులు, నాలుగు సంస్థలను ఎంపిక చేస్తామన్నారు. ఈ అవార్డు కింద రూ.రెండు లక్షల నగదుతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తామని వివరించారు. ఐదేండ్లుగా అంటే 2019 నుంచి తెలంగాణలో ఆయా కేటగిరీల్లో పనిచేసిన వ్యక్తులు లేదా సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తెలంగాణలో పనిచేసిన వ్యక్తులు, సంస్థలు ఉండాలనీ, ఇక్కడ పనిచేస్తున్న తెలంగాణేతరులు కూడా ఉండొచ్చని స్పష్టం చేశారు. నాలుగు కేటగిరీల్లో అత్యుత్తమ విజయాలను ప్రోత్సహించడం, అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తింపునిచ్చేందుకు ఈ అవార్డులు దోహదపడతాయని వివరించారు. గవర్నర్ ప్రత్యేకంగా జ్యూరీ కమిటీని పద్మవిభూషణ్, ఆస్కి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మెన్ పద్మనాభయ్య నేతృత్వంలో ఏర్పాటు చేశారని చెప్పారు. ఎంపిక కమిటీ అన్ని దరఖాస్తులనూ పరిశీలించి అర్హులైన వారిని అవార్డుల కోసం ఎంపిక చేస్తుందన్నారు. ఒకవేళ దరఖాస్తుల్లో సరైన వ్యక్తులు లేదా సంస్థల్లేకుంటే ఆ కమిటీ నేరుగా ఎంపిక చేసే అవకాశముందని అన్నారు. రాజ్‌భవన్ వేదికగా గవర్నర్ పేరుతో అవార్డులను ప్రదానం చేయడం దేశంలోనే ఇదే ప్రథమమని వివరించారు. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి అవార్డులను ప్రదానం చేయడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తోపాటు ముఖ్యమంత్రి కూడా హాజరవుతారని అన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. వాటి సమర్పణకు ఈనెల 23న సాయంత్రం ఐదు గంటల వరకు గడువుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో https://governor.telangana.gov.in ద్వారా దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. అందులో దరఖాస్తు ఫారం అందుబాటులో ఉందనీ, డౌన్‌లోడ్ చేసుకోవాలని వివరించారు. ఆఫ్‌లైన్‌లో గవర్నర్ ముఖ్యకార్యదర్శి, గవర్నర్ సెక్రటేరియట్, రాజ్‌భవన్, సోమాజిగూడ, హైదరాబాద్-500041 అడ్రస్‌కు స్పీడ్ పోస్టు ద్వారా అన్ని పత్రాలతో సమర్పించాలని కోరారు. గవర్నర్ మారినా ఈ అవార్డుల ప్రదానం కొనసాగుతుందనీ, దీనిపై ఎవరికీ ఇబ్బంది ఉండబోదని స్పష్టం చేశారు. జూన్ రెండు నాటికి కాలుష్య రహిత రాజ్‌భవన్‌గా తీర్చిదిద్దాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లక్ష్యంగా నిర్దేశించుకున్నారని వివరించారు. ప్రజా రాజ్‌భవన్‌గా మారుస్తామంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారని గుర్తు చేశారు. అందులో భాగంగా వికలాంగుల సాంస్కృతిక కార్యక్రమాలు ఇక్కడే జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జాయింట్ సెక్రెటరీ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దిగుమతి సుంకాన్ని పెంచడం రైతులకు ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని 27.5 శాతానికి పెంచడం రైతులకు ఊరట అని టీజీ ఆయిల్ ఫెడ్ ఎండీ ఎస్‌కే యాస్మీన్ బాషా అని చెప్పారు. రైతులకు అధిక ధరలను అందించి, ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేసి కొత్త రైతులను ప్రోత్సహించేందుకు ఇది మరింత తోడ్పడుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.19,144కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ చొరవతో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.6000కు పెరగడం ఆయిల్ పామ్ రైతులకు శుభ పరిణామమని అభిప్రాయపడ్డారు. ఆయిల్ ఫెడ్ మిల్‌లో 2023-24లో నమోదైన నూనె రికవరీ శాతం రికార్డు స్థాయిలో ఉన్నందున ఈ వచ్చే ఆయిల్ ఇయర్ 2024-25లో ఆయిల్ పామ్ గెలల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

ఇచ్చిన మాట ప్రకారం ఇంటింటి సర్వే

- ప్రభుత్వానికి పూర్తిగా సహకరించండి
- సమగ్రకులగణనపై రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం బహిరంగలేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన మాట ప్రకారం ఈ నెల ఆరో తేదీనుంచి రాష్ట్రంలో ఇంటింటి సమగ్ర సర్వేను నిర్వహించనున్నట్టు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రజలకు బహిరంగలేఖ రాశారు. గతేడాది ఎన్నికల సమయంలో కామారెడ్డి బహిరంగ సభలో తమ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమక్షంలో బిసి డిక్లరేషన్‌ను ప్రకటించామని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారమే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సమగ్ర సర్వే(సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాది, రాజకీయ, కులాల సర్వే) కుల గణన చేపట్టాలని నిర్ణయించినట్టు గుర్తు చేశారు. శాసన సభలో కూడా తీర్మానం చేసినట్టు తెలిపారు. దీనికి అనుగుణంగా జిఒ 26 ద్వారా కుల గణన చేసేందుకు తెలంగాణ బిసి కమిషన్ తీర్మానాన్ని అనుసరించి బిసి సంక్షేమ శాఖ ద్వారా రూ.150 కోట్లను విడుదల చేసేందుకు ప్రక్రియను ప్రారంభించిందని పేర్కొన్నారు. 30 లోపు సమాచార సేకరణ పూర్తి చేయాలనే ప్రణాళికలతో కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సర్వే రాబోయే కాలంలో అన్ని రకాల పథకాలను పొందేందుకు మెగా హెల్త్ చెకప్ లాగా ఉపయోగపడుతుందని తెలిపారు.

LAURUS Labs
Chemistry for Better Living

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య : L24239AP2005PLC047518
రిజిస్టర్డ్ ఆఫీస్: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 531 021
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం. 7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ.
Phone: +91 40 3980 4333; Fax: +91 040 3980 4320
Email: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com

రికార్డు తేది ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 91 యొక్క నియమాలు మరియు ది సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా లిస్టింగ్ రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 42 మరియు 43ను అనుసరించి, అక్టోబర్ 24, 2024న నిర్వహించబడిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఆర్థిక సం॥ 2024-25 కొరకు **ప్రతి వాటా (ముఖ విలువ రూ.2/-తో) ఒక్కొంటికి రూ.0.40 పై (20%)**గా మధ్యంతర డివిడెండ్ మొత్తం చెల్లించుటకై వాటాదారుల అర్హత నిర్ధారించుటకు కొరకు "రికార్డు తేది"ని **నవంబర్ 06, 2024**గా నిర్ణయించబడినది మరియు డివిడెండ్ మొత్తం ప్రకటించిన 30 రోజులలోపు చెల్లించబడుతుంది.
తదుపరి, ఈ ప్రకటన కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.lauruslabs.comలో కూడా అందుబాటులో ఉంటుంది.

బోర్డు ఆదేశం మేరకు
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున
సం/- **జి. వెంకటేశ్వర్ రెడ్డి**
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేది: నవంబర్ 01, 2024

నిర్వాసితులకు మెరుగైన పరిహారం!

- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముందుకు..
- ఆర్ఆర్ఆర్ భూ బాధితులకు మూడింతల పరిహారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సమాచారం. గత అనుభవాలను, నిబంధనలను దృష్టిలో పెట్టుకొని మెరుగైన పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా ప్రాజెక్టుల భూసేకరణ చేసిన సమయంలో రైతులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో కొండపోచమ్మ, దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని రీజనల్ రింగ్ రోడ్‌లో అలాంటి సమస్యలు ఎదురుకాకుండా చూడాలన్నదే ప్రభుత్వ నిర్ణయమని అధికారులు చెబుతున్నారు. 2022లో రీజనల్ రింగ్ రోడ్డు నోటిఫికేషన్ వెలువడక ముందే మూడేండ్ల పాటు భూమి విలువను తీసుకొని దానికి మూడింతల పరిహారం భూ బాధితులకు అందించడానికి కసరత్తు చేస్తున్నట్టు అధికారుల ద్వారా అందుతున్న సమాచారం.



భూసేకరణలో ముందుకు..

నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్‌లో అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం భూమి విలువ ఎకరాకు రూ.8-10 లక్షల వరకు ఉన్నట్టు సమాచారం. ఈ విలువ మూడేళ్ల క్రితం 25శాతం తక్కువగా ఉండగా దీన్ని మూడింతలు లెక్కించి ఆ స్థాయిలో పరిహారం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో భూముల విలువకు, ప్రభుత్వం ఇచ్చే పరిహారానికి పొంతనలేదని, రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉందని ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితులు ఆరు నెలల నుంచి పైగా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టుల్లో కోల్పోయిన భూముల్లో పౌల్ట్రీ ఫారాలు, వ్యవసాయ భూముల్లో బోరు బావులు, చెట్లు ఇతర నిర్మాణాలకు ప్రత్యేకంగా ధర కట్టి ఇస్తామని గతంలో ప్రభుత్వం చెప్పి భూములు తీసుకున్న తర్వాత చేతులు దులిపేసుకుందన్న విమర్శలు ఉన్నాయి. రీజనల్ రింగ్ రోడ్ విషయంలోనూ ముందుగా చెప్పి తర్వాత చేతులెత్తేసే అవకాశం లేకపోలేదని రైతులు అనుమానిస్తున్నారు. కానీ రెవెన్యూ అధికారులు ముందుగానే వాటిపై రైతులకు క్లారిటీ ఇస్తామని చెప్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కువ భూ సేకరణ..

ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ రెవెన్యూ డివిజన్ల వారీగా (క్యాంప్టన్ అథారిటీ ఫర్ ల్యాండ్ ఆక్వా జైషెన్) కాలా పరిధిలో ఉమ్మడి నల్లగొండ, మెదక్ జిల్లాలో 84 గ్రామాల్లోని 4750 ఎకరాలు భూ సేకరణ చేస్తుండగా, అత్యధికంగా గజ్వేల్‌లో 980 ఎకరాలకు పైగా భూసేకరణ చేస్తున్నారు. ఉత్తర భాగం రీజనల్ రింగ్ రోడ్డు ఆనుకొని 158 కిలోమీటర్ల కాగా ఇందులో 110 కిలోమీటర్లకు పైగా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోనే భూములు ఉన్నాయి. వీటికి సంబంధించిన నోటిఫికేషన్లు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి భూసేకరణకు అధికారులు ముందుకు సాగుతున్నారు. గజ్వేల్ ప్రాంతంలో 980 ఎకరాలకు పైగా భూసేకరణకు 97.5 ఎకరాలకు సంబంధించి త్రీడీ, త్రీజీ నోటిఫికేషన్ పెండింగ్‌లో ఉండగా పూర్తి చేశామన్నారు. గజ్వేల్ ప్రాంతంలో రీజనల్ రింగ్ రోడ్డు భూ సేకరణలో రైతుల నుంచి సమస్య రాకుండా చూడాలనేదే ప్రభుత్వ నిర్ణయమని అధికారులు అంటున్నారు.

పత్తి కొనుగోలు కోసం ఏర్పాట్లు చేయాలి

- మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్కెట్లకు, జిన్నింగ్ మిల్లులకు వచ్చిన పత్తిని కొనేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో పత్తి కొనుగోలుపై మంత్రి సమీక్షించారు. వాట్స్ యాప్ సేవల (8897281111) ద్వారా వెయిటింగ్ టైమ్, పేమెంట్ స్టేటస్, కంప్లయింట్ ఫోరం, ఇతర సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు, సెక్రటరీలు రైతులకు అందుబాటులో ఉండాలని కోరారు. అకాల వర్షాలు వస్తున్నందున మార్కెటింగ్, వ్యవసాయ అధికారులు, సిసిఐ అధికారులు అప్రమత్తంగా ఉండి, రైతు తీసుకొచ్చి పంట తడవకుండా కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్ల విషయంలో అవకతవకలు జరిగితే తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

డెంగ్యూతో బాలుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని మర్రిపల్లిలో శుక్రవారం బాలుడు డెంగ్యూతో మృతిచెందాడు. బాలుడు శశివర్ధన్ డెంగ్యూ జ్వరంతో బాధపడ్డాడు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశీలించుకోవాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు, అధికారులు సూచించారు.

మొమోస్ కేసులో ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బంజారాహిల్స్‌లో వారాంతపు సంతలో మొమోస్ తిని ఓ మహిళ మృతిచెందిన ఘటనకు సంబంధించి ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చింతల్ బస్తీలో మొమోస్ తయారు చేస్తున్న కేంద్రంలో ఇటీవల జిహెచ్ఎంసి అధికారులు తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. అనంతరం అక్కడ మొమోస్ తయారు చేస్తున్న అల్మాస్, సాజిద్ హుస్సేన్, రాయిస్, షారుక్, హనీఫ్, రాజిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులంతా బిహార్‌కు చెందిన వారుగా గుర్తించారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా సాగర్

- ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో స్టార్ హోటల్ నిర్మాణం
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్‌ను గొప్ప ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంలో స్టార్ హోటల్ నిర్మాణంతోపాటు వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బుద్ధవనం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన హార్ట్‌ఫుల్‌నెస్ (రామచంద్ర మిషన్) మార్గదర్శి కమలేష్ డి పటేల్ (దాజీ), ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, టూరిజం, రెవెన్యూ అధికారులతో కలిసి బుద్ధవనం లే-అవుట్, విజయ విహార్ లేఔట్లను పరిశీలించారు. 274 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న బుద్ధ వనం విశేషాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి ప్రకాష్‌రెడ్డి, బుద్ధవనం కన్సల్టెంట్ శివనాగిరెడ్డి మంత్రికి, దాజీకి వివరించారు. అనంతరం వీరు బుద్ధవనాన్ని సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి నివాసంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. నాగార్జునసాగర్, బుద్ధవనానికి ప్రత్యేకించి శ్రీలంక, ఇతర ఆసియా ఖండాల నుంచి ఎక్కువ మంది వస్తారని, వారికి అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి అవసరం ఉందని అన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి వివరాలు సమర్పించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను ఆదేశించారు. నాగార్జునసాగర్‌ను ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసే దశలో హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి దాజీతో కలిసి బుద్ధవనం పక్కన ఉన్న విపస్యన ధ్యాన కేంద్రం, ఇతర ప్రదేశాలను పరిశీలించామన్నారు. నాగార్జునసాగర్‌లో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా కాటేజీల నిర్మాణాన్ని చేపట్టనున్నామని, నియోజకవర్గంలో నూటికి నూరు శాతం పెద్దఎత్తున టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే కె.జయవీర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అంతకు ముందు విజయవిహార్ అతిథి గృహానికి వచ్చిన మంత్రి జూపల్లికి పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి ప్రకాష్‌రెడ్డి, బుద్ధవనం ఒఎస్‌డి సూధన్‌రెడ్డి, బుద్ధిష్ట్ కన్సల్టెంట్ శివనాగిరెడ్డి, బుద్ధవనం డిజైన్ ఇన్‌చార్జ్ శ్యాంసుందర్, టూరిజం అధికారులు పాల్గొన్నారు.

లేఔట్లను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి తదితరులు

సరోజినీదేవి ఆస్పత్రికి క్యూ

- బాణసంచా పేలి గాయాలతో ఆస్పత్రికి బాధితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దీపావళి పండుగ వేళ బాణాసంచా పేల్చే క్రమంలో కంటికి గాయాలపాలైన పలువురు హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి క్యూ కట్టారు. గురువారం నుంచి శుక్రవారం ఉదయానికి ఆస్పత్రికి చికిత్స కోసం 48 మంది వచ్చారు. వీరిలో ఎనిమిది మందికి తీవ్రగాయాలు కాగా వారిని ఆస్పత్రిలో చేర్చి చికిత్సనందిస్తున్నారు. మిగిలిన 40 మందిని అవుట్ పేషెంట్లుగా చికిత్సనందించి పంపించారు. ముందస్తు జాగ్రత్తగా ప్రత్యేకంగా వంద పడకలు, ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచినట్టు సరోజినీదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదినీ తెలిపారు. గాయాలపై ఆస్పత్రికి వచ్చిన 48 మందిలో 20 మంది చిన్నారులుండగా, 28 మంది పెద్దలున్నారు. రోగుల్లో అత్యధికంగా 45 మంది హైదరాబాద్‌కు చెందిన వారు కాగా, ముగ్గురు ఇతర జిల్లాలకు చెందిన వారున్నారు. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముండడంతో దానికి తగినట్టు ఏర్పాట్లు చేసినట్టు వైద్యులు తెలిపారు. ప్రజల్లో అవగాహన పెరగడంతో గతేడాది కన్నా ఈ ఏడాది కేసులు తగ్గుతాయని ఆశిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. మరోవైపు ప్రమాదవశాత్తు కాలిన గాయాలతో ముగ్గురు చికిత్స కోసం రాగా వారికి చికిత్సనందించినట్టు ఆ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. వేడుకలు, శుభకార్యాలు, ఇతర ఉత్సవాల సమయంలో ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు. ముఖ్యంగా కంటి వంటి సున్నితభాగాలను కాపాడుకునే క్రమంలో పిల్లల పట్ల ఈ జాగ్రత్తలు మరింత అవసరమని డాక్టర్ మోదినీ సూచించారు.

సచివాలయానికి ఎస్‌పిఎఫ్ సెక్యూరిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర సచివాలయం సెక్యూరిటీ బాధ్యతలను ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టిజిఎస్‌పిఎఫ్) శుక్రవారం స్వీకరించింది. ఇక నుంచి ఎస్‌పిఎఫ్‌కు చెందిన 214 మంది సాయుధులు 24 గంటల పాటు పహారా కాయనున్నారు. గేట్లు, ఇతర ప్రాంతాల్లో సాయుధ గార్డు, లోపల గస్తీ వంటి బాధ్యతలను నిర్వహించనున్నారు. గతంలో మాదిరిగానే ఆక్టోపస్, హైదరాబాద్ సిటీ పోలీసులు లా అండ్ అర్డర్, ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. సచివాలయం ప్రారంభించిన తర్వాత మొదట్లో ఎస్‌పిఎఫ్ విభాగమే భద్రతను నిర్వహించింది. గతేడాది ఏప్రిల్ 25న భద్రతా నిర్వహణను తెలంగాణ స్పెషల్ పోలీస్ (టిజిఎస్‌పి)కు అప్పగించారు. అయితే భద్రతతోపాటు అగ్నిప్రమాదాల నుంచి రక్షణ వంటి పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఎస్‌పిఎఫ్‌కు సచివాలయం భద్రత బాధ్యతలు అప్పగించాలని ఆగస్టు 5న ప్రభుత్వానికి డిజిపి ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సెక్యూరిటీ బాధ్యతలను టిజిఎస్‌పి నుంచి ఎస్‌పిఎఫ్‌కు అప్పగించింది.

టియుఎంహెచ్‌ఇయు నాయకులు

104 ఉద్యోగుల వేతనాల బకాయిలు చెల్లిస్తాం

- ఉద్యోగులందర్నీ డిఎంఇ పరిధిలో సర్దుబాటు చేస్తాం
- టియుఎంహెచ్‌ఇయు నాయకులకు కమిషనర్ హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

104 ఉద్యోగుల వేతనాల బకాయిలు ఈ నెలలో చెల్లిస్తామని, వారందరిని డిఎంఇ పరిధిలో సర్దుబాటు చేస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కుటుంబ సంక్షేమ కార్యాలయంలో 104 ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్‌ఇయు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో నాయకులు కలిశారు. 104 సేవల ద్వారా పనిచేసిన ఉద్యోగుల కొనసాగింపు, అక్టోబర్ వరకు వేతనాలు చెల్లిస్తామని గతంలో ఇచ్చిన హామీపై ఏమైనా చర్యలు తీసుకున్నారా అని కమిషనర్ అడిగారు. వారికి సమాధానమిస్తూ కమిషనర్, అందరిని నవంబరు నెలాఖరు నాటికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఇ) పరిధిలో సర్దుబాటు చేస్తామని చెప్పారు. అలాగే వేతనాలకు సంబంధించి కూడా ఆర్థిక శాఖ అనుమతిచ్చిన నేపథ్యంలో అక్టోబర్ వరకు ఈ నెలలో చెల్లిస్తామని కూడా చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటళ్లు ,ఇతర టీచింగ్ ఇన్స్టిట్యూట్లలో ఉద్యోగులందరినీ సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులను ఎవ్వరినీ తొలగించబోమని తేల్చిచెప్పారు. సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపిస్తున్నందుకు ఆ నాయకులు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. సాధ్యమైనంత తొందరగా ఆ రెండు హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో భూపాల్ మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలపై ముఖ్యంగా కొనసాగింపు, పెండింగ్ జీతాల కోసం గత ఆరుమాసాలు సిఐటియు నిరంతరం పోరాటం చేస్తున్నదని గుర్తుచేశారు. ఉద్యోగులందరూ పోరాడుతున్నదెవరో గమనించి ఐక్యం కావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.విజయవర్ధన్ రాజు, మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు సుభాష్, శేఖర్, వేణు, రంగారెడ్డి జిల్లా నాయకులు శ్రీనివాసు, స్టాఫ్ నర్స్ సంఘం నాయకురాలు టి.సువర్ణ లతా తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ గడువు మరోసారి పొడిగింపు ?

- నేడో, రేపో ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్ గడువును మరోసారి పొడిగించే అకవాశాలు ఉన్నాయి. ఇప్పటికే రెండుసార్లు కమిషన్ గడువు పెంచిన సర్కారు, మూడో సారి పెంచేందుకు ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వనుంది. కాగా తొలి దఫా ఉత్తర్వుల్లో మూడు నెలలల్లో విచారణ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. అందుకు అనుగుణంగా జస్టిస్ ఘోష్ విచారణ కొనసాగిస్తున్న విషయమూ విదితమే. కాగా తొలి వంద రోజుల గడువు జూన్ నెలాఖరుతో పూర్తయింది. దీనిపై విచారణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రెండుసార్లు రెండు నెలల చొప్పున కమిషన్ గడువును పొడిగించింది. ప్రభుత్వ గడువు పెంపు శుక్రవారంతో పూర్తయింది. అయితే, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియ ఇంకా ముగియలేదు. విచారణలో భాగంగా ఎగ్జామినేషన్, క్రాస్‌ఎగ్జామినేషన్ ఇంకా నడుస్తోంది. అది కూడా అధికారులు, ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజనీర్ల వరకే పూర్తయింది. ఐఎఎస్ అధికారులు, మాజీ ఐఎఎస్ అధికారులను కమిషన్ విచారించాల్సి ఉంది. విజిలెన్స్, ఎన్‌టిఎస్ఎ, కాగ్ నివేదిక ఆధారంగా ఇతర అంశాలపైనా విచారణ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే అప్పటి ప్రభుత్వ పెద్దలైన సిఎం, సాగునీటి శాఖ మంత్రి, ఈవిషయంతో సంబంధమున్న ఇతర ప్రజాప్రతినిదులు,రాజకీయనాయకులను కూడా విచారణ చేసేందుకు కమిషన్ సన్నద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించనుంది. సంబంధిత ఫైలుపై ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మరో రెండు నెలలపాటు పొడిగిస్తూ ఒకటి, రెండు రోజుల్లో ఆదేశాలు జారీ అయ్యే అవకాశం ఉంది.

మహిళపై లైంగికదాడికి యత్నం

- అవమానంతో పురుగు మందు తాగిన బాధితురాలు
- వేములపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివాహిత ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. దాంతో అవమానభారంతో ఆమె పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీదేవిగుడెం గ్రామానికి చెందిన గంట క్రిష్ణయ్య గత నెల 21 తేదీన రాత్రి సమయంలో ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి భయపెట్టి లైంగికదాడికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటపడడంతో పారిపోయాడు. అనంతరం మహిళ మనస్తాపంతో పురుగు మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు సూర్యాపేట ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో బాధిత కుటుంబ సభ్యులు 22న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు కావడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధి సమక్షంలో రాజీ చేయడానికి ప్రయత్నించి విషయాన్ని గోప్యంగా ఉంచారు. అదే సమయంలో నిందితుడు క్రిష్ణయ్య కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. చికిత్స అనంతరం ఆయన కోలుకున్నాడు. కానీ బాధితురాలి పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. నిందితునిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన రోజే కేసు నమోదు చేసినట్టు, డిఎస్‌పి ఆధ్వర్యంలో విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పిఎసిఎస్‌లను రీ ఆర్గనైజేషన్ చేయండి

- అధికారులతో మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాథమిక సహకార సంఘాల (పిఎసిఎస్) సేవలు రైతులకు మరింత సులభతరంగా, సమర్ధవంతంగా అందేలా రీ-ఆర్గనైజేషన్ చేయాలని సహకార శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. అవసరమున్న చోట కొత్త శాఖలను ఏర్పాట్లు చేయాలనీ, సంఘాల పరిపుష్టికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సహకార శాఖపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. పిఎసిఎస్, మార్కెటింగ్ యార్డుల్లో సంస్థాగతంగా చేపట్టాల్సిన చర్యలను ఆదేశించారు. డిసిసిబి, డిసిఎంఎస్‌లలో గతంలో జరిగిన అవకతవకలన్నింటిపై శాఖాపరమైన విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రయోగాత్మకంగా ప్రతి జిల్లాకు ఒక మోడల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మార్కెట్ల ఆధీనంలో ఉన్న గోదాముల నిర్వహణ, ఖాళీ స్థలాలలను వాణిజ్య అవసరాలకు ఉపయోగపడే విధంగా చేసి మార్కెట్ల ఆదాయం పెంచడంతోపాటు ఆ నిధులను రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా సౌకర్యాల కల్పనకు వినియోగించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, కో-ఆపరేటీవ్ అడిషనల్ రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

- పాడి రైతులకు సబ్యసాచి ఘోష్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాడి రైతులు పాల ఉత్పత్తిలో గణనీయ ప్రగతిని సాధించారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ అభినందించారు. శుక్రవారం సచివాలయంలో ఉచిత పశువైద్య శిబిరాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలో పాడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు. 2024-25 బడ్జెట్‌లో ఈ శాఖకు రూ. 1980 కోట్లు సిఎం రేవంత్‌రెడ్డి కేటాయించారని గుర్తు చేశారు. 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 2210 ఉచిత పశువైద్య గర్భకోశ శిబిరాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరాల్లో దీర్ఘకాలికంగా ఎదకు రాకుండా గర్భం దాల్చని పశువులను గుర్తించి, వాటికి తగు చికిత్స చేయడం, ఎదలో ఉన్న పశువులలో కృత్రిమ గర్భధారణలు చేయడం, చూడి పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు, విటమిన్ ఇంజెక్షన్లు, పాడి పశువులలో పాల దిగుబడి పెంచేందుకు ఖనిజ లవణ మిశ్రమాలను అందించడం, ఇతర చికిత్సలు చేస్తామన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన, పాడిపశువుల్లో పాల దిగుబడి పోటీలు నిర్వహించి రైతులకు కృత్రిమ గర్భధారణపై, అధిక పాల దిగుబడినిచ్చే మేలుజాతి పాడిపశువులపైన అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి ఉచిత పశువైద్య గర్భకోశ శిబిరాలు, దూడల ప్రదర్శన, పాడిపశువులలో పాల దిగుబడి పోటీలను పాడి రైతులు సద్వినియోగం చేసుకొవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సమీప గోపాల మిత్ర, పశువైద్య పశువైద్యాధికారి, కార్యనిర్వహణాధికారి, ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థను సంప్రదించాలని కోరారు.

రైతులు కన్నీరు పెడుతుంటే డైవర్షన్ పాలిటిక్స్‌తో సిఎం బిజీ

- ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ వైపు రైతులు పొలాల్లో కన్నీరు పెడుతుంటే తెలంగాణ సిఎం రేవంత్ మాత్రం రోత పుట్టించే కూతలతో... డైవర్షన్ పాలిటిక్స్‌తో బిజీబిజీగా గడుపుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా సిఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షం కారణంగా ఐకెపి కేంద్రల్లో ఉంచిన రైతుల ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని ఓ రైతు విమర్శలు చేస్తున్న వీడియోను కెటిఆర్ పోస్ట్ చేసి... ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ దళారి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని వాపనోయారు. వానాకాలం వరికోతలు సాగుతున్నాయని... కానీ ఈరోజు వరకు రైతుబంధు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రూ.15 వేల రైతుభరోసా ఊసే లేదన్నారు. కనీసం హార్వెస్ట్ చేసిన పంటను కూడా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాలకు చాలాచోట్ల కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో 91.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నారని, గత నెలలో 8.16 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా నిర్ణయించిందని వివరించారు. కానీ, పోయిన నెల 28 వరకు 913 మంది రైతుల నుంచి 7,629 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. రైతన్న అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యమని విమర్శించారు. దళారులతో కుమ్మక్కైన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మిల్లుల కేటాయింపు జరగనే లేదని విమర్శించారు.

నిమ్స్ ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఉచిత స్క్రీనింగ్ క్యాంపును ఈ నెల ఒకటి నుంచి ప్రతి రోజు నిర్వహిస్తున్నట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఆ విభాగాధిపతి డాక్టర్ పార్వతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల తొమ్మిది వరకు ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పిల్లలకు సంబంధిచి మొర్రి (క్లెఫ్ట్), క్రానియో ఫేషియల్ అసామాన్యతలు, పుట్టుకతో హస్త విపత్తులు, పక్షవాతం, కాలిపోయిన, ప్రమాదానంతరం ఏర్పడిన వైకల్యతలు, రక్తనాళ అసామాన్యతలు, 12-14 సంవత్సరాల్లోపు పిల్లల్లో ఉన్న ఇతర లోపాలను ఈ క్యాంపులో గుర్తించనున్నట్టు తెలిపారు. వారికి ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్య శ్రీ, సిఎంఆర్ఎఫ్ , ఎల్ఒసి ద్వారా కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని వివరించారు. అవసరమున్న వారు నిమ్స్ ఆవరణలోని పాత ఒపిడి బ్లాక్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని రూమ్ నెంబర్ 8లో డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9393835845, 040-23489049 నెంబర్లలో సంప్రదించవచ్చు.

బాలికపై సామూహిక లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగులోకి..
- వికారాబాద్ జిల్లా దోమ మండలంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలికపై ఐదుగురు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడిన ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలంలో జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. 8వ తరగతి చదువుతున్న బాలికకు కొన్ని నెలల నుంచి అదే గ్రామానికి చెందిన ఓ బాలుడితో పరిచయం ఏర్పడింది. అదను చూసుకుని గత నెల 28న పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత సాయంత్రం బాలికకు మాయమాటలు చెప్పి ఆ బాలుడు తన ఇంటిలోకి తీసుకువెళ్లాడు. అప్పటికే ప్రీ ప్లాన్‌తో ఉన్న ముగ్గురు మైనర్లు, ఇద్దరు మేజర్లు మొత్తం ఐదుగురు.. బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం ఇంటికి వచ్చిన బాలికను.. ఎక్కడికి వెళ్లావని తల్లిదండ్రులు మందలించడంతో జరిగిన విషయాన్ని వారికి చెప్పింది. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, బాలికకు పరీక్షలు నిర్వహించగా.. 12 వారాల గర్భం దాల్చినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ప్రస్తుతం నిందితులు డిఎస్‌పి కస్టడీలో ఉన్నట్టు తెలుస్తోంది. నిందితులపై పోక్సో చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు దోమ ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.